క్లుప్తంగా

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా కాళికాంబ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఒడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి



స్థానికులతో మాట్లాడుతున్న డాక్టర్ బాలాజీ

నంద్యాల(అర్బన్): కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించడంలో సర్వే పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ బాలాజీ కోరారు. కుష్టువ్యాధిని సకాలంలో గుర్తిస్తే నయం చేయవచ్చన్నారు. పట్టణంలోని హరిజనవాడ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని హరిజనవాడలో జరుగుతున్న అర్బన్ లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపైన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దోమల నివారణ కోసం ప్రతి శుక్రవారం జరిగే డ్రై డే, ఫ్రైడే కార్యక్రమంతో పాటు బహిరంగ మల విసర్జన నిర్మూలనకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గంగాధర్, వైద్యాధికారులు,ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ: జాతీయ క్షయ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతు సలహా మండలి చైర్మన్, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు పోచా రాధాకృష్ణారెడ్డి పౌష్టికాహారాన్ని వ్యాధిగ్రస్తులకు శుక్రవారం అందజేశారు. రెండు కిలోల గోధుమపిండి, కంది పప్పు, బెల్లం, వేరుశనగ పప్పు, రాగిపిండి, ఒక్కో కేజీ చొప్పున కిట్లను మండలంలోని 35 మందికి అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రమేష్‌చంద్ర బాలజీ, వెంకటసుబ్బయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

నంద్యాల(రూరల్): జాతీయ పశు వ్యాధి నివారణ కార్యక్రమం కింద మండలంలోని కానాల, హైస్కూల్ కొట్టాల గ్రామాల్లో శుక్రవారం గ్రామ పశువైద్యాధికారి శ్రీనివాసులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ వ్యాధి సోకిన పశువుల్లో వ్యాధి నిరోధక సామర్థ్యం తగ్గిపోతుందని, దూడల్లో మరణం సంభవించే అవకాశం ఉందని చెప్పారు. నియంత్రించడానికి పాడి పశువులకు టీకాలు తప్పని సరిగా వేయించాలని సూచించారు. ఈనెల 31వ తేదీ వరకు టీకాల కార్యక్రమం కొనసాగుతుందని, ఆయా గ్రామాల్లోని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబాన్ని ఆదుకోవాలి



పీడీతో మాట్లాడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా నాయకుడు

నంద్యాల(రూరల్): రెండు రోజుల క్రితం నంద్యాల జిల్లా అహోబిలం-ఆళ్లగడ్డ రహదారిలోని నరసాపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గోస్పాడు మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవదాసు కోరారు. ఈ మేరకు శుక్రవారం డ్వామా పీడీ కార్యాలయంలో పీడీ రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. నంద్యాల, గోస్పాడు, బండిఆత్మకూరు, మహానంది, శిరివెళ్ల మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంటువ్యాధుల వ్యాప్తికి చెక్

- పందుల నుంచి మెదడు వాపు, వ్యాధులు ప్రబలకుండా చర్యలు
- పెంపుడు జంతువులకు లైసెన్స్ తప్పనిసరి
- ప్రతి పందికి ట్యాగ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశం
- ప్రజారోగ్య రక్షణకు చర్యలు

జనావాసాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న పందుల నుంచి మనుషుల ఆరోగ్యాన్ని రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు 693 జీఓ తెచ్చింది. విధివిధానాల ప్రకారం గ్రామానికి 3–4కి.మీ. దూరంగా తరలించాలి. అక్కడే నివాసం ఏర్పాటు చేసుకోవాలని, ఇందుకు పంచాయతీ అనుమతి తప్పనిసరి చేయడమే కాకుండా ఫీజును కూడా నిర్దేశించింది. అలాగే పందులన్నింటికీ ట్యాగింగ్ చేయాలని నిర్ణయించింది. పందుల పెంపకానికి లైసెన్స్‌తో పాటు పశువైద్యాధికారుల నుంచి హెల్త్ సర్టిఫికెట్ పొందాలని పేర్కొంది. చివరగా పందుల పెంపకంపై గ్రామ, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.

నంద్యాల: పందుల నుంచి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విచ్చలవిడిగా పెరిగిపోతున్న పందుల పెంపకం నుంచి జనజీవనం అస్తవ్యస్తమవుతోంది. బాధ్యత లేకుండా విచ్చలవిడి పందుల పెంపకంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మనుషులకు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా, అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పందుల పెంపకంపై నిబంధనలను కఠినతరం చేసింది. కర్నూలు, నంద్యాల జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 11,482 పందులున్నట్లు పశుసంవర్ధక శాఖాధికారులు తెలియజేస్తున్నారు. అయితే అనధికార లెక్కల ప్రకారం లక్షల్లో ఉన్నట్లు సమాచారం.

పందుల పెంపకంపై నిబంధనలు ఇలా..

- గ్రామ పంచాయతీ పరిధిలో పందుల పెంపకందారులు, పందులు పెంచుతున్న ప్రదేశాలను గుర్తించాలి.
- ప్రతి సంవత్సరం పందుల పెంపకందారులు గ్రామ పంచాయతీ నుంచి ఉచితంగా లేక పంచాయతీ తీర్మానం ద్వారా నిర్దేశించబడిన ఫీజు చెల్లించి లైసెన్స్ పొందాలి.
- పంచాయతీ అనుమతి పొందిన ప్రతి పందికి ట్యాగ్ ఏర్పాటు చేయాలి.
- లైసెన్స్ పొందుటకు పందుల పెంపకందారులు పశువైద్యాధికారుల నుంచి పొందిన హెల్త్ సర్టిఫికెట్ దరఖాస్తు పంచాయతీ అధికారులకు సమర్పించాలి.
- పందుల పెంపకానికి అనుమతి పొందిన వారు లైసెన్స్ కాలపరిమితి ముగియడానికి 10 రోజుల్లోపే రెన్యూవల్ చేయించుకోవాలి.



నంద్యాల పట్టణంలో ఇళ్ల మధ్య తిరుగుతున్న పందులు

పందుల పెంపకంపై కమిటీలు..

మండల కమిటీ	గ్రామ కమిటీ
కమిటీ చైర్మన్‌గా ఎంపీడీఓ కన్వీనర్‌గా ఈఓఆర్‌డీ సభ్యులుగా తహసీల్దార్, ఎస్‌ఐ, పశువైద్యాధికారి	చైర్మన్‌గా సర్పంచ్ కన్వీనర్‌గా పంచాయతీ కార్యదర్శి సభ్యులుగా వైద్యాధికారి, మండల పశుసంవర్ధక అధికారి

- లైసెన్స్ లేని పందులను బయట కనిపిస్తే బంధించి పంచాయతీ అధికారులు దండోరా వేయించాలి.
- లైసెన్స్ లేని పందులు గ్రామ పంచాయతీ ద్వా రా బంధించబడిన తర్వాత సదరు యజమానికి నోటీసులిచ్చి గడువులోపు ప్రతి పందికి రూ.250 చొప్పున(24గంటలకు) అపరాధరుసుం వసూలు చేయాలి.

పందుల నియంత్రణకు మార్గదర్శకాలు..

- పందుల పెంపకం వల్ల మెదడువాపు వ్యాధులు సంక్రమిస్తుండడంతో వాటి పెంపకంపై ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది.
- ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 3 నుంచి 4 ప్రత్యామ్నాయ స్థలాలు గుర్తించి పందుల నివాసాన్ని ఏర్పాటు చేసుకునేందుకు పెంపకందారులకు అవకాశమివ్వాలి.
- గ్రామ పంచాయతీ పరిధిలో నివాస స్థలాలకు 3–4 కి.మీ. దూరంలో పందులను పెంచుకునేందుకు స్థలాలు ఏర్పాటు చేసుకోవాలి.
- వాటి పెంపకానికి ఉపయోగించే పెంపకందారులు గ్రామ పంచాయతీకి నిర్దేశించిన ఫీజు చెల్లించాలి.

పందుల నియంత్రణకు చర్యలు



పంచాయతీల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న పందుల వల్ల మనుషులకు హాని కలగడం, అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో పందుల నియంత్రణకు ప్రభుత్వం జీఓ 693 తెచ్చింది. పందులను నివాస ప్రాంతాల సమీపంలో ఉండకుండా వెలుపలికి పంపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీనిపై గ్రామ, మండల స్థాయిలో పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తున్నాం.

– శ్రీనివాసులు, జిల్లా పంచాయతీ అధికారి, నంద్యాల

ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్‌డీఓ శ్రీనివాసులు

నంద్యాల(అర్బన్): ఈనెల 13వ తేదీన జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్‌డీఓ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక నిశాంతి భవన్‌లో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల డిస్ట్రిబ్యూషన్, రిసిప్షన్‌లకు సంబంధించిన అంశాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 12న ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఎన్నికల మెటీరియల్ నంద్యాల డివిజన్‌లోని అన్ని పోలింగ్ కేంద్రాలకు చేరుతుందన్నారు. 13న ఎన్నికల నిర్వహణ అనంతరం మెటీరియల్ మొత్తం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చేరుతుందని, ఎన్నికల సమయంలో ఏ ఒక్కరు నిర్లక్ష్యం చేసినా ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రతి ఉద్యోగి అంకిత భావంతో పనిచేసి ఎన్నికల నిర్వహణను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉయ్యాలవాడ : స్థానిక 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2వ శనివారం సందర్భంగా మరమ్మతులు చేపడుతున్నామని చెప్పారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. వ్యవసాయానికి తెల్లవారుజామున 4 గంటల నుంచి విద్యుత్ సరఫరా ఉంటుందని చెప్పారు.

వడ దెబ్బ, వైరల్ ఫీవర్‌పై అప్రమత్తంగా ఉండండి

నంద్యాల: అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా రాష్ట్రంలో వడదెబ్బ, వైరల్ ఫీవర్ తదితర సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం వెలగపూడిలోని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్యాంపు కార్యాలయం నుంచి ఆరోగ్యం, శిశు సంక్షేమం, ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ తదితర ప్రభుత్వ పథకాల అభివృద్ధి లక్ష్యాలు, గ్రామ వార్డు సచివాలయాలు, స్పందన అర్జీల పరిష్కారం, గడప గడపకు మన ప్రభుత్వం తదితర అంశాల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ నిశాంతి, అధికారులు పాల్గొన్నారు. జవహర్ రెడ్డి మాట్లాడుతూ ఇన్‌ఫ్లూయాంజ వైరస్, వడదెబ్బ తీవ్రతపై కేంద్ర ప్రభుత్వ ఇచ్చిన సూచనల మేరకు అన్ని జిల్లాలలో అప్రమత్తంగా ఉండాలన్నారు. తక్షణం వారం రోజుల పాటు ఫీవర్ సర్వే నిర్వహించాలని సూచించారు. వడదెబ్బకు గురి కాకుండా ప్రజల్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓలకు కలెక్టర్లు తక్షణమే ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఎండ వేడిమి ఎక్కువగా ఉన్న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల సమయంలో ప్రజలు బయట తిరగకుండా హెచ్చరికలు జారీ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణ బాబు సూచించారు. మార్చి 15వ తేదీ నుంచి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ పూర్తి స్థాయిలో అమలు చేయాలని, అదే రోజు ఒక విలేజ్ క్లినిక్ వద్ద ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేయాలని డీఎంహెచ్‌ఓ వెంకటరమణకు సూచించారు. పాఠశాలల్లో రక్తహీనత గల విద్యార్థులు జగనన్న గోరుముద్ద పథకం వినియోగించుకునేలా, చర్యలు తీసుకునేలా ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలకు ఆదేశాలు జారీ చేయాలని డీఈఓ అనురాధను ఆదేశించారు. కార్మిక సంక్షేమ శాఖ పీడీ లీలావతి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

పంట మార్పిడి అవలంభించాలి

డోర్నిపాడు: రానున్న ఖరీఫ్ సాగులో రైతులు పంట మార్పిడి విధానాలను అవలంభించాలని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ సూచించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో మండల స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈసారి పంట మార్పిడి చేయడంతో దిగుబడుల్లో సత్ఫలితాలు వచ్చాయన్నారు. సీహెచ్‌సీ గ్రూపులో యంత్ర పరికరాలను రాయితీ రూపంలో తీసుకోవాలని కోరారు. అలాగే పంటలకు మందుల పిచికారీ కోసం డ్రోన్ యంత్రాన్ని సబ్సిడీ కింద ఇస్తున్నామని చెప్పారు. చిరుధాన్యాల సాగుపై ప్రతి రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు గ్రామ వ్యవసాయ సహాయకులు అవగాహన కల్పించాలని సూచించారు. శనగలు, జొన్నలను ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుందని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్, పశువుల్లో నట్టల నివారణ గురించి వివరించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏఓ శ్రీకృష్ణ

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి

ఆళ్లగడ్డ: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన వసతులు కల్పించాలని సెక్టోరియల్ అధికారి మురళి తెలిపారు. మండల కేంద్రం చాగలమర్రిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. దివ్యాంగుల కోసం వీల్ చైర్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల వ్యాప్తంగా 1,490 మంది పట్టభద్రుల ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, 115 మంది ఉపాధ్యాయుల కోసం ఒక కేంద్రం ఏర్పాటు చేశామని చెప్పారు. తహసీల్దార్ విజయకుమార్ ఉన్నారు.



చాగలమర్రిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెక్టోరియల్ అధికారి మురళి

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయండి

నంద్యాల(సిటీ): జాతీయ నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా ఉపయోగించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకదాస్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి ఆధ్వర్యంలో మాత్రలను పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలకు పంపిణీ చేశారు. ఆశా కార్యకర్తలు, అర్బన్ హెల్త్ సెంటర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని సమష్టిగా పని చేసి విజయవంతం చేద్దామని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, వైద్యాధికారులు రమేష్‌చంద్ర బాలాజీ, రాబర్ట్ కెనడీ, వెంకటసుబ్బయ్య, ప్రియాంక, శివలింగమ్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాఠశాలల హెచ్‌ఎంలు, ఆరోగ్య సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు.అనంతరం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, కృష్ణ, మునిస్వామి, దస్తగిరి పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయులకు మాత్రలు అందజేస్తున్న ఎంపీడీఓ, వైద్యాధికారులు

శిరివెళ్ల: ఈ నెల 14వ తేదీన జరగనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని మండల ప్రభుత్వ వైద్యాధికారి విజయకుమార్ అన్నారు. శుక్రవారం కార్యక్రమం అమలుపై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 2–19 ఏళ్ల వయస్సు గల పిల్లలు 9,654 మంది ఉన్నారని, వీరికి మధ్యాహ్న భోజనం అనంతరం నులిపురుగుల నిర్మూలన మందులు వేయాలని సూచించారు. 2 ఏళ్ల పిల్లలకు అర ట్యాబ్లెట్, 3–19 సంవత్సాల వయస్సున్న వారికి ఒక ట్యాబెట్లు వేయాలని చెప్పారు. 1–5 ఏళ్ల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో, మిగిలిన వారికి పాఠశాలలో వేయాలన్నారు. 14న రాని పిల్లలకు తిరిగి 18వ తేదీన వేయాలని సూచించారు. ఈఓఆర్డీ సాల్మన్‌రాజు, సీహెచ్‌ఓ రాంమోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోస్పాడు: ఆల్బెండజోల్ మాత్రలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని గోస్పాడు వైద్యాధికారి డాక్టర్ గోపాల్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక ఆరోగ్య కేంద్రం పరిధిలోనున్న వారందరికీ ఈనెల 14వ తేదీన మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈఓఆర్‌డీ నాగేంద్రుడు ఆధ్వర్యంలో మాత్రలు అందజేశారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం

రుద్రవరం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థి వెన్న పూసరవీంద్రా రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపిద్దామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి ఓటర్లను కోరారు. మండల కేంద్రంతో పాటు ముత్తలూరులో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన ఓటర్ల ఇళ్లకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, నాయకులు గంగుల విజయసింహారెడ్డి తదితరులు ఉన్నారు. కాగా మండలంలో మొత్తం 789 మంది ఓటర్లు ఉండగా ఆయా గ్రామాల్లో సర్పంచులు,నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు.

శిరివెళ్ల: వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలంటూ ఎంపీపీ నాయక్ వసీం శుక్రవారం మండల కేంద్రంలోని 4, 5, 6, 7 వార్డుల్లో ఉప సర్పంచు ఇంతియాజ్‌తో కలిసి ప్రచారం చేశారు

డోర్నిపాడు:ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ గోవవరం అమర్‌నాథ్‌రెడ్డి, డోర్నిపాడు సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నపాఠశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించి ఎంవీ రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. ఆళ్లగడ్డ మార్కెట్‌యార్డు డైరెక్టర్ భూమా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: పశ్చిమ రాయలసీమ వైఎస్సార్‌సీపీ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అభ్యర్థించారు. శుక్రవారం పట్టణంలోని న్యాయవాదులు, పడకండ్ల గ్రామంలో ఆయన ప్రచారం నిర్వహించారు. అలాగే.. చాగలమర్రిలోని ప్రభుత్వ, ప్రైవేటు, కళాశాలలు, పాఠశాలల్లో ఎంపీపీ వీరభద్రుడు, వైఎస్సార్‌సీపీ షేక్ బాబులాల్ ప్రచారం చేశారు. పార్టీ మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు వెంకటరమణ, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ పాల్గొన్నారు.



ముత్తలూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

నీటి యంత్రం పరిశీలన

నంద్యాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలోని ప్రయోగశాలలో ఉన్న నీటి స్వచ్ఛత శాతాన్ని పరిశీలించే (టీడీఎస్)యంత్రాన్ని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ శుక్రవారం పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బ్యాలెట్ బాక్స్‌ల పరిశీలన అనంతరం ప్రయోగశాలలో ఉన్న యంత్రాన్ని పరిశీలించి సంబంధిత సిబ్బంది నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ మనోహర్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తితే త్వరగా పరిష్కరించేందుకు ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్‌కు నివేదించారు. ఫిర్యాదు స్వీకరించిన వెంటనే సంబంధిత సిబ్బంది ఆయా ప్రాంతాలకు చేరుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తారన్నారు. ఆయా కార్యాలయాల్లో సిబ్బంది ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటారని చెప్పారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

బనగానపల్లెరూరల్: భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మి రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కేవీకేలో నేషనల్ ఫర్టిలైజర్ లిమిటెడ్, కేవీకే సంయుక్త ఆధ్వర్యంలో భూసార పరీక్ష ఆధారిత ఎరువుల యాజమాన్యంపై బనగానపల్లె, నందికొట్కూరు మండలాల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పలువురు శాస్త్రవేత్తలు భూసార పరీక్షల ఆవశ్యకతను వివరించారు.

వెన్నపూసను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం




మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): హైకోర్టు న్యాయవాది వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి న్యాయవాదులకు పిలుపునిచ్చారు. శుక్రవారం కోర్టు ఆవరణ, కోర్టు కార్యాలయంలో విస్తృత ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీల్లో భాగంగా కోర్టు ఆవరణలో మంచినీటి సౌకర్యం, హెల్త్‌కార్డులు, ఇళ్లు లేని న్యాయవాదులకు ఇంటి స్థలాలను ఇప్పించడానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. అలాగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న ఎంవీ రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, పట్టణ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, పెద్ది శ్రీనివాసులు, విజయశేఖర్‌రెడ్డి, ముక్కెర కృష్ణారెడ్డి, బాబురావు, ఏపీపీలు తిరుపతి, వివేకానంద రెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, పెద్ద స్వామి, ఓబులరెడ్డి, శ్రీదేవి, కృపావతి పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి వేసి ఆశీర్వదించాలని కోరారు. శుక్రవారం పట్టణంలోని పలు కళాశాలలు, పాఠశాలల్లో శుక్రవారం ఆయన విస్తృతంగా ప్రచారం చేశారు. అనంతరం రామకృష్ణ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు.

పది రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

నంద్యాల(సిటీ): నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల (ఎన్‌పీఐ) నిర్మాణాలు పది రోజుల్లో పూర్తి చేయాలని హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(డీఈఈ) వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని సచివాలయ అమెనిటీస్ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.డీఈఈ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. 384 గృహాల్లో కేవలం 288 గృహాల నిర్మాణాలు పూర్తి చేశారని, పెండింగ్‌లో ఉన్న 96 గృహాలను పది రోజుల్లో పూర్తి చేయకపోతే అమెనిటీస్ సెక్రటరీలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హౌసింగ్ ఏఈ రాజ రఘువర్మ, వర్క్‌ఇన్‌స్పెక్టర్లు సికిందర్, శోభారాణి, జయంత్, నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈఈ వెంకటేశ్వర్లు

గైర్హాజైన వారికి షోకాజ్ నోటీసులు..

సమావేశానికి గైర్హాజరైన ఆరుగురు అమెనిటీస్ సెక్రటరీలకు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు షోకాజు నోటీసులు జారీ చేశారు. ముందస్తు సమాచారం లేకుండా విధుల్లో అలసత్వం చూపినందున అమెనిటీస్ సెక్రటరీలకు షోకాజు నోటీసులు జారీ చేశామని చెప్పారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

ఉయ్యాలవాడ : ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకునేలా ఓటర్లకు అవగాహన కల్పించవలసిన బాధ్యత మనందరిపై ఉందని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మండలంలో 22,789 ఓటర్లుండగా ఇప్పటి వరకు 17,154 మంది ఓటర్లకు సంబంధించి ఆధార్‌కార్డులు అనుసంధానం పూర్తయ్యిందన్నారు. ఇంకా 5,556 మంది ఓటర్లు ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాల్సి ఉందని, ఈ నెల 30వ తేదీలోపు పూర్తి చేసేలా వీఆర్‌ఓలు క్షేత్రస్థాయికి వెళ్లి తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తులసీ కృష్ణ, ఆర్‌ఐ సత్తార్, సిబ్బంది పాల్గొన్నారు.